# సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025




### కలుషిత జలాలతో నష్టం

భూగర్భ జలాల కలుషితంతో వరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



### కారులో మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో కారులో మంటలు చెలరేగిన సంఘటన మొయినాబాద్ ఠాణా ఎదుట జరిగింది. 8లో▸



### కబ్జాకు యత్నం?

ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తిని గ్రామస్తులు అడ్డుకున్నారు. 8లో▸

## న్యూస్‌రీల్

### పెంజర్ల అనంత పద్మనాభ స్వామి సన్నిధిలో స్పీకర్



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

**కొత్తూరు:** అనంత పద్మనాభస్వామి ఆలయాల్లో కేరళ, వికారాబాద్ తర్వాత కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో ఉన్న ఆలయం ఎంతో ప్రఖ్యాతి గాంచిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆలయ పునర్నిర్మాణ వేడుకల సందర్భంగా సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డి స్పీకర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఏఐసీసీ నేత చల్లా వంశీచంద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### 108 వాహనంలో ఆకస్మిక తనిఖీ



**షాద్‌నగర్:** పట్టణంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని సోమవారం జిల్లా ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ మేనేజర్ రాజబాబు, ఆడిటింగ్ హెచ్‌ఓ ఫకీర్‌దాస్ తనిఖీ చేశారు. వాహనంలోని ప్రాథమిక చికిత్స పరికరాలు, మెడికల్ కిట్, ఇతర రికార్డులను పరిశీలించారు. అత్యవసర సమయంలో బాధితులకు అందజేస్తున్న సేవల గురించి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పవన్‌కుమార్, పైలెట్ అనిల్‌కుమార్ యాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత సిబ్బందికి ఉందని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణులు, పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

### యాచారం సీఐపై బదిలీ వేటు

**యాచారం:** అనుకున్నట్లే జరిగింది. యాచారం సీఐ నర్సింహారావుపై బదిలీ వేటు పడింది. మాల్‌లో మతిస్థిమితం లేని వృద్ధురాలిపై లైంగిక దాడి కేసులో నిర్లక్ష్యంగా వహరించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు సోమవారం సీఐ నర్సింహారావును మల్కాజిగిరి సీసీఎస్‌కు బదిలీ చేస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సీఐగా నందీశ్వర్ రెడ్డి మల్కాజిగిరి సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు.

### సర్వర్ సమస్యతో నిలిచిన రిజిస్ట్రేషన్లు



శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం

**శంకర్‌పల్లి:** ధరణి పోర్టల్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 19 రిజిస్ట్రేషన్లకు గాను స్లాట్స్ బుక్ చేసుకోగా.. 8 మాత్రమే పూర్తయ్యాయి. సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో కొద్దిసేపు సర్వర్ వచ్చినట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

### ఫ్రీ చికెన్ స్నాక్స్ మేళా

**అనంతగిరి:** కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకిన కారణంగా ప్రజలు గుడ్లకు, చికెన్‌కు దూరంగా ఉంటున్నారు. చికెన్, కోడిగుడ్లలో పోషక విలువలపై ప్రజల్లో అవగాహన పెంచాలనే ఉద్దేశంతో వికారాబాద్‌లోని ఎన్నేపల్లి చౌరస్తాలో ఫ్రీ చికెన్ స్నాక్స్ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా ఉడికించిన కోడిగుడ్లు, చికెన్ పకోడీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించిన చికెన్, గుడ్లలో ఎలాంటి వైరస్ ఉన్నా చనిపోతుందని తెలిపారు.

# తలసరిలో టాప్

**ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా**

- సగటున రూ.11.46 లక్షల రాబడి
- దేశంలోనే అత్యధిక వార్షిక ఆదాయం
- ఐటీ, ఫార్మా, రియల్ పెట్టుబడులు
- పుష్కలంగా ఉపాధి అవకాశాలు



**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో మన జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. 2023–24లో తలసరి సగటు ఆదాయం రూ.11.46 లక్షలుగా తేలింది. తర్వాతి స్థానాల్లో హర్యానాలోని గుర్గావ్ (రూ. 9.05లక్షలు) ఉండగా, కర్ణాటకలోని బెంగళూరు (రూ.8.93 లక్షలు), యూపీలోని గౌతంబుద్ధనగర్ (రూ.8.48 లక్షలు), హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలాన్ (రూ.8.10 లక్షలు), గోవా (రూ.7.64 లక్షలు), సిక్కిం (రూ.7.46 లక్షలు), మహారాష్ట్రలోని ముంబై (రూ.6.57 లక్షలు), గుజరాత్‌లోని అహ్మదాబాద్ (రూ.6.43 లక్షలు), హైదరాబాద్ (రూ.5.39 లక్షలు), తమిళనాడులోని చెన్నై (రూ.5.20 లక్షలు) ఉన్నాయి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మన జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు వెల్లడైంది.

**పెరిగిన ఉపాధి అవకాశాలు**

తలసరి వార్షికాదాయంలో తెలంగాణలోనూ జిల్లా టాప్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రణాళికాశాఖ జనాభా, విద్య, ఆర్థిక, సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ఇటీవల విడుదల చేసిన అట్లాస్‌లోనూ ఇదే అంశం స్పష్టమైంది. జిల్లాలో అంతర్జాతీయ విమానాశ్రయానికి తోడు ఔటర్ రింగ్‌రోడ్డు ఉండటం కలిసి వచ్చింది. కావాల్సినన్ని భూములు అందుబాటులో ఉండటం.. ఇతర ప్రాంతాలతో పోలిస్తే, కావాల్సినంత మ్యాన్‌పవర్ అందుబాటులో ఉండటం.. ఉద్యోగుల వేతనాలు కూడా చాలా తక్కువగా ఉండటంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఐటీ అనుబంధ సంస్థలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలే కాదు రియల్ ఎస్టేట్ రంగం సైతం ఇక్కడ ఎక్కువగా పెట్టుబడులు పెడుతుండటంతో జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఫలితంగా జిల్లా వాసుల సగటు వార్షిక ఆదాయం భారీగా పెరిగింది. వస్తు ఎగుమతి, దిగుమతి కూడా జిల్లా నుంచే అత్యధికంగా జరుగుతోంది.

**గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో సగటు తలసరి ఆదాయం ఇలా..**

| జిల్లా | 2018-19 | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 |
|---|---|---|---|---|---|
| రంగారెడ్డి | 5,90,015 | 6,23,555 | 6,73,280 | 8,01,003 | 9,54,949 |
| హైదరాబాద్ | 3,56,398 | 3,64,058 | 3,34,050 | 4,07,222 | 4,97,854 |
| సంగారెడ్డి | 2,29,464 | 2,57,451 | 2,47,531 | 2,91,621 | 3,21,799 |
| మేడ్చల్ | 2,13,362 | 2,28,798 | 2,09,054 | 2,51,709 | 2,95,214 |
| నల్లగొండ | 1,57,441 | 1,97,796 | 2,00,470 | 2,38,040 | 2,62,619 |



సమావేశంలో అధికారులకు గోడు విన్నవిస్తున్న రైతులు

# పరిహారం పెంచి ఇవ్వండి

- టీజీఐఐసీకి భూములు కోల్పోయిన రైతుల డిమాండ్

**ఇబ్రహీంపట్నం రూరల్:** టీజీఐఐసీకి భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం పెంచి ఇవ్వాలని భూ బాధితుల కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని ఎల్మినేడు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, టీజీఐఐసీ మేనేజర్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను ఏకరువు పెట్టారు. ఎల్మినేడులో వివిధ పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీఐఐసీ ద్వారా భూములు సేకరించిన ప్రభుత్వం సరైన పరిహారం ఇవ్వలేదని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. ఎకరం భూమి కోల్పోయిన రైతుకు ఎకరానికి 121 గజాల ప్లాటు, ప్రస్తుతం ఉన్న వాల్యూ ప్రకారం ఎకరానికి రూ.30 లక్షలు చెల్లించాలన్నారు. 2013 ఆర్‌ఎస్‌ఆర్ ప్యాకేజీ ప్రకారం పరిహారం ఇస్తే బాగుంటుందన్నారు. గతంలో జరిగిన అవకతకవలపై రీ సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీఓ అనంతరెడ్డి మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేలా కలెక్టర్‌తో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలో భూములు కోల్పోయిన పలువురు రైతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పగడాల యాదయ్య

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

**ఇబ్రహీంపట్నం రూరల్:** మధ్యాహ్న భోజన కార్మికులపై పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యాదయ్య మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్నోసార్లు ఆందోళనలు చేసినా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరించిందని విమర్శించారు. మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజనం పథకంలో పని చేస్తున్న కార్మికులకు రూ.10వేలు వేతనం ఇస్తామని చెప్పినప్పటికీ నేటికీ అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, బుట్టి బాలరాజు, పెంటయ్య, గణేశ్, అండాలు, సరిత, సావిత్రి, కవిత, అక్కమ్మ, రాజేష్, నరేందర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- పది, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- మెరుగైన ఫలితాల కోసం కృషి చేయండి
- వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడండి
- సంబంధిత అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర అధికారులు

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఇంటర్మీడియట్, టెన్త్ వార్షిక పరీక్షల్లో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని.. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. మెరుగైన ఫలితాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

**నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు**

రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో నీటి సరఫరా సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. పంచాయతీ, మండల, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**'ప్రజావాణి'కి 70 ఫిర్యాదులు**

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సము దాయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీ ల్లో రెవెన్యూకు సంబంధించినవి 36 ఉండగా, మ రో 34 ఇతర శాఖలు సంబంధించినవి ఉన్నాయి.

# ఎఫ్‌ఎన్‌సీసీది కబ్జా స్థలమే!

- చర్యలు తీసుకోవాలని హైడ్రాకు స్థానిక నేత ఫిర్యాదు



ఫిలింనగర్ రోడ్ నెం.1లో ఎఫ్‌ఎన్‌సీసీ కింద మిగులు పార్కు స్థలం

**ఫిలింనగర్:** ప్రజల అవసరాలకు ఉద్దేశించిన, జీహెచ్‌ఎంసీలో ఉండాల్సిన పార్క్ రాక్‌గార్డెన్ స్థలాన్ని కబ్జా చేసి ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌ను (ఎఫ్‌ఎన్‌సీసీ) నిర్మించారని, దాన్ని ప్రస్తుతం వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని స్థానిక నేత ఒకరు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం మిగిలి ఉన్న పార్కు స్థలాన్నైనా పరిరక్షించి, అభివృద్ధి చేయాలని ఈ నెల 17న ఫిర్యాదు చేయగా.. దీనిపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. జూబ్లీహిల్స్‌కు చెందిన కాంగ్రెస్ నేత కాటూరి రమేష్ ఇచ్చిన ఫిర్యాదులోని అంశాల ప్రకారం.. ఫిలింనగర్ సొసైటీ ఏర్పడినప్పుడు ఆ లేఔట్‌లో దాదాపు రెండున్నర ఎకరాలు స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. జీహెచ్‌ఎంసీ ఆధీనంలో ఉండాల్సిన దీన్ని కొందరు సొసైటీ పెద్దలు ఆక్రమించడంతో పాటు అడ్డదారుల్లో అప్పటి ప్రభుత్వం నుంచి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఖాతరు చేయకుండా నిర్మాణాలు చేపట్టారు. ఈ స్థలం పూర్తిగా పార్కు కోసం కేటాయించగా.. ప్రస్తుతం అందులో జీ ప్లస్ 3 విధానంలో భవనం నిర్మించారు. ఎఫ్‌ఎన్‌సీసీ పేరుతో పిలుస్తున్న దీన్ని పూర్తిగా రాక్ గార్డెన్ స్థలంలో నిర్మించారు. దీనిపై గతంలో ఎన్నోసార్లు పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రమేష్ తన ఫిర్యాదుతో పాటు ఫిలింనగర్ సొసైటీ లేఔట్‌కు సంబంధించిన మ్యాప్‌ను జతపరిచారు. ఇటీవల భారీ వర్షాలకు ఎఫ్‌ఎన్‌సీసీ ముందు భాగం కుప్పకూలింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతోనే ఇది కూలిపోయిందని అప్పట్లోనే దర్యాప్తు సంస్థలు నిగ్గుతేల్చాయని హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిలింనగర్ రోడ్ నెం.1లోని రాజరాజేశ్వరి గుడి ముందు ఎఫ్‌ఎన్‌సీసీ ఆధీనంలో ప్రస్తుతం 1,200 చదరపు గజాల ఖాళీ స్థలం ఉందని, దాన్ని కూడా కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కనీసం దాన్నయినా కాపాడి పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికైనా పట్టించుకోకుంటే ఆ స్థలం కూడా కబ్జాకు గురై, అక్రమ నిర్మాణాలకు అడ్డా అవుతుందని స్పష్టం చేశారు. ఎఫ్‌ఎన్‌సీసీకి చెందిన వాళ్లు తమకు పలుకుబడి వినియోగించి దుకాణాలు నిర్మించడంతో పాటు అద్దెకు ఇచ్చుకుంటారని, ఆ దిశలో ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని రమేష్ ఆరోపించారు. అన్యాక్రాంతమైన పార్కు స్థలాలు, చెరువులను కాపాడుతున్న హైడ్రా ఎఫ్‌ఎన్‌సీసీ పైనా దృష్టి పెట్టాలని కోరారు. ఎఫ్‌ఎన్‌సీసీ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

# శివ పూజకు వేళాయె



శివగంగ రాజరాజేశ్వర ఆలయం

- మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయం ముస్తాబు
- నేటి నుంచి మార్చి 1 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

**మహేశ్వరం:** మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. మంగళవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయానికి చేరుకోవడానికి పలు డిపోల నుంచి అధికారులు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు.

**పూజా కార్యక్రమాలు ఇవీ..**

- 25న గణపతిపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం.
- 26న మహాశివరాత్రి రోజు ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు రాజరాజేశ్వరుడితో పాటు గంగధరేశ్వరుడు, ముక్తేశ్వరుడు, ఏకాంబరేశ్వరుడు, అమరావతీశ్వరుడు, హరిహరేశ్వరుడు, అమరేశ్వరుడు, మణికర్ణికేశ్వరుడు, మహానందీశ్వరుడి ఆలయాల్లో రుద్రాభిషేకం. రాజరాజేశ్వరీ దేవికి కుంకుమార్చన, సహస్రనామార్చన, బిల్వార్చన, మంత్రపుష్పం, మంగళ హారతి.
- 27న ఉదయం 7 గంటల నుంచి రాజరాజేశ్వర స్వామి చుట్టూ ఉన్న ఆలయాల్లో కొలువైన విగ్రహాలకు కుంకుమార్చన, రుద్రాభిషేకం, రాత్రి 8 గంటలకు శివ పార్వతుల కల్యాణం.
- 28న ఉదయం స్వామివారి రుద్రహోమం, రథోత్సవం, రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు రథం ఊరేగింపు, దాతలకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు.
- మార్చి 1న ఉదయం 9 గంటలకు లలితాంబిక సేవా సమితి వారిచే సామూహిక లలితా సహస్ర పారాయణం, రాత్రి 9 గంటలకు దోపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు.



మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

**పటిష్ట బందోబస్తు**

బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు మహేశ్వరం జోన్ డీసీపీ సునీతా రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఒక ఏసీపీ, ఒక ట్రాఫిక్ ఏసీపీ, ఆరుగురు సీఐలు, 32 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, 86 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 60 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్‌తో కలిపి సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆలయం చుట్టూ నాలుగు స్పెషల్ పార్టీల పోలీసులతో పహారా, చెక్ పోస్టుల ఏర్పాటు, వాహనాల పార్కింగ్, వెళ్లడానికి దారులను ఏర్పాటు చేశామన్నారు. ఆలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు, వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అనంతరం బందోబస్తుపై మహేశ్వరం ఏసీపీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు.

# 'సీనియర్లను' ఇబ్బంది పెట్టొద్దు!

- ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

**సాక్షి, సిటీబ్యూరో:** తమకు గుర్తింపు కార్డులివ్వడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారని, తద్వారా కొన్ని సదుపాయాలు పొందలేకపోతున్నామని సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కొందరు సీనియర్ సిటిజన్లు కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేశారు. వారి సాదకబాధకాలు విన్న కమిషనర్ సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులివ్వడంలో జాప్యం చేయొద్దని, వారిని ఇబ్బంది పెట్టొద్దని సంబంధిత అధికారుకు సూచించారు. ప్రజల నుంచి అందే అన్ని ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ వారం ప్రధాన కార్యాలయానికి మొత్తం 82 విజ్ఞప్తులు రాగా, ఎప్పటిలాగే టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి అత్యధికంగా 46 ఉన్నాయి. మిగతావి ఆస్తిపన్ను, ఆరోగ్యం, ఇంజినీరింగ్ (నిర్వహణ), పరిపాలన, విద్యుత్, భూసేకరణ, యూబీడీ, హౌసింగ్, ఫైనాన్స్ విభాగాలకు సంబంధించినవి ఉన్నాయి. కార్యాలయం దాకా రాలేని ఆరుగురు ఫోన్ ద్వారా తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి రావు, సీసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆరు జోన్లలో జరిగిన ప్రజావాణి కార్యక్రమాల్లో 112 అర్జీలందాయి. కూకట్‌పల్లి జోన్‌లో 51, ఎల్బీనగర్‌లో 13, శేరిలింగంపల్లిలో 12, సికింద్రాబాద్‌లో 27, చార్మినార్‌లో 8 ఉండగా, ఖైరతాబాద్ జోన్ కేవలం ఒక్కటి మాత్రమే అందడం విశేషం.

# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం?



ప్రభుత్వ స్థలంలో చదును చేసిన వాహనం

### అడ్డుకున్న గ్రామస్తులు

**కేశంపేట:** ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తిని గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి బైర్కాన్‌పల్లి గ్రామ శివారు సర్వే నంబర్ 53లో డంపింగ్ యార్డుతో పాటు 4ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు గత నెల 21న సర్వే చేశారు. ఆ భూమి పక్కనే ఉన్న 53/37 సర్వే నంబర్‌లో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి 10 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అయితే సదరు వ్యక్తి.. పక్కనే ఉన్న సర్కారు భూమిలో సోమవారం ఎస్కవేటర్‌తో బండరాళ్లను తొలగిస్తుండగా.. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తంచేశారు. నీ స్థలంలోనే హద్దురాళ్లను పాతుకోవాలని సూచించినా వినకుండా చదును చేస్తుండటంతో.. పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు, సిబ్బంది అక్కడి చెరుకుని పనులను అడ్డుకున్నారు. సర్వే అనంతరం హద్దురాళ్లను పాతుకోవాలని పట్టాదారుడికి సూచించనట్లు తహసీల్దార్ అజాం అలీ పేర్కొన్నారు.

# ఇల్యూజన్ పబ్‌లో యువతిపై దాడి

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఇల్యూజన్ పబ్‌లో శనివారం రాత్రి మద్యం మత్తులో ఓ యువకుడు ఓ యువతిపై దాడి చేసి పొత్తి కడుపులో బూటు కాలితో తన్ని తీవ్రంగా గాయపరిచిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..పాతబస్తీకి చెందిన యువతి తన ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి శనివారం రాత్రి ఇల్యూజన్ పబ్‌కు వచ్చింది. రాత్రి 12.40 గంటల సమయంలో ఆమె మాజీ ప్రియుడు ఓల్డ్ సిటీకే చెందిన ఎండీ ఆసిఫ్‌జానీ మద్యం సేవించి అక్కడికి వచ్చాడు. సదరు యువతి స్నేహితురాళ్లతో బర్త్‌డే వేడుకలు జరుపుకుంటుండగా అక్కడికి వచ్చిన ఆసిఫ్‌జానీ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దూషిస్తూ దాడి చేశాడు. దీంతో ఆమె స్నేహితురాళ్లతో కలిసి కిందకు పరుగులు తీయగా అక్కడికి కూడా వచ్చిన ఆసిఫ్‌జానీ ఆమె పొత్తి కడుపులో బూటు కాలితో తన్నడమేగాక తీవ్రంగా కొట్టాడు. అడ్డుకునేందుకు యత్నించిన ఆమె స్నేహితురాలిపై కూడా దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. గతంలో ఆసిఫ్‌జానీ, తాను ప్రేమించుకున్నామని, కొద్ది రోజులు కలిసి తిరిగామని, అయితే అతడి ప్రవర్తన నచ్చకపోవడంతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నానని తెలిపింది. అయినా తనను వెంబడిస్తూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. జూబ్లీహిల్స్ పోలీసులు ఆసిఫ్‌జానీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డీజే వాహనం సీజ్



సీజ్ చేసిన డీజే వాహనం

**కడ్తాల్:** నిబంధనలను అతిక్రమించి భారీ సౌండ్లతో శబ్ద కాలుష్యానికి పాల్పడిన డీజే యాజమానితో పాటు, వివాహ నిర్వాహకులపై కేసు నమోదు చేసి, డీజే వాహనాన్ని సీజ్ చేశారు. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కొండ్రిగాని బోడ్‌తండాలో ఆదివారం రాత్రి వివాహ వేడుక నిమిత్తం డీజేను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి అతిగా సౌండ్స్ పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించడంతో.. స్థానికులు 100 నంబర్‌కు డయల్ చేశారు. ఈ మేరకు పోలీసులు తండాకు చేరుకుని డీజే వా హనాన్ని, పరికాలను సీజ్ చేశారు. సదరు యాజమానితో పాటు, నిర్వాహకులపై కేసు నమోదు చేశా రు. నిబంధనలను అతిక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా సౌండ్ బాక్స్‌లు పెడితే చట్టప రమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## యువతి అదృశ్యం



ఫాతిమ(ఫైల్)

**పహాడీషరీఫ్:** యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ కుమార్తె తహసీన్ ఫాతిమ(23) ఇంటి వద్దే ఉండేది. ఈ నెల 22న సాయంత్రం గౌస్ భార్య సాఫియా బేగం షాపింగ్ కోసం చార్మినార్‌కు వెళ్లింది. రాత్రి 9 గంటలకు వచ్చి చూడగా ఇంట్లో యువతి కనిపించలేదు. తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సాఫియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆమె వివరాలు తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ లేదా 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

**మరో వ్యక్తి..**



అంజయ్య(ఫైల్)

**కందుకూరు:** ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన మార్చ అంజయ్య(50) కందుకూరులోని కుమార్తె వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తుండేవాడు. అతనికి అప్పుడప్పుడు మానసిక స్థితి సరిగా ఉండదు. కాగా ఈ నెల 21న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి తెలిసిన చోట వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో కుటుంబీకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన

**బంజారాహిల్స్:** మానవ అక్రమ రవాణా నిర్మూలనపై రంగారెడ్డి, సంగారెడ్డి, నల్లగొండ, మేడ్చల్, మల్కాజిగిరి, సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి జిల్లాలకు చెందిన డీపీఎంలు, ఏపీఎంలు, వీఓఏలకు సోమవారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ సరిత మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం జరిగే తీరు, బాధితురాలిపై ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు, భరోసా, చైల్డ్‌లైన్, పోలీసు టోల్‌ఫ్రీ నెంబర్స్ తదితర అంశాలపై అవగాహన కలిగించారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి

- టీడబ్ల్యూజేఎఫ్ నేతల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, కొత్తగా ఆరోగ్య బీమా పథకాన్ని తీసుకురావాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, మైల సైదులు డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో మేరకు సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నాయని విమర్శించారు. దీంతో పాత్రికేయుల పరిస్థితి దారుణంగా మారిందని, అనేక ఒడిదుడుకుల మధ్య బాధ్యతలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రత్యేక చొరవ చూపాలి**

ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని పాత్రికేయ నాయకులు కోరారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రివ్యూ పిటీషన్ వేసి వాదనలు చేయాలని సూచించారు. జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కొత్త విధానం ద్వారా నివాస స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలని, వారికి భద్రత కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యలపై ఆయనకు వివరించారు. దీనికి స్పందించిన కలెక్టర్.. జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ ఇచ్చేలా చూడాలని డీఈఓకు ఆదేశాలు ఇచ్చారని, అనంతరం తక్షణమే జిల్లాలో అమలు చేయాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, ఆంజనేయులు, నరేష్, మల్లేశ్, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రసాయన పరిశోధనలకు మద్దతు

- పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్
- ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్ హబ్
- 28 వరకు కొనసాగనున్న సెమినార్లు



మాట్లాడుతున్న జయేష్‌రంజన్, చిత్రంలో ఇండో- జర్మనీకి చెందిన ప్రొఫెసర్లు

**సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి:** హైదరాబాద్ హబ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని, పరిశ్రమలు, వాణిజ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్ హబ్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జర్మనీలోని హీడెల్‌బర్గ్ యూనివర్సిటీ, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఐఐటీ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈనెల 28 వరకు కొనసాగుతుంది. సోమవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జయేష్‌రంజన్ మాట్లాడారు. శాస్త్ర, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ఇండో–జర్మనీ దీర్ఘకాలిక భాగస్వామ్యానికి అనుగుణంగా ఈ హబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమం రెండు దేశాల్లోని విద్యార్థుల సంయుక్త పరిశోధనకు తోడ్పడుతుందన్నారు. అలాగే ఆధునిక రసాయన శాస్త్రంలో అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. 17 మంది జర్మనీ విద్యార్థులతో పాటు, ఐఐటీ హెచ్, టీఐఎఫ్ఆర్ విద్యార్థులు, ఆయా విద్యా సంస్థల ప్రొఫెసర్లతో కలిసి ఇండో–జర్మన్ స్కూల్ ఆన్ కంప్యూటేషనల్ కెమిస్ట్రీని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ రసాయన రంగంలోని పరిశోధనలు, ఆవిష్కరణలు వ్యవసాయ రంగం ప్రగతిలో కీలకమైనవని పేర్కొన్నారు. ఔషధాలు, ఇంధన వనరులు, మెటీరియల్ రంగాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాయని చెప్పారు. కంప్యూటేషనల్ కెమిస్ట్రీ ఆధునిక పారిశ్రామిక రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని, వీటిలోని ఆవిష్కరణలు ఆయా రంగాల్లో వ్యయాన్ని తగ్గించి, పర్యావరణంపై ప్రభావాన్ని కూడా తగ్గిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెడెల్‌బర్గ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కట్సాపట్రేల్‌మేటర్న్, అండ్రియాస్‌డ్రాఫ్, సబూర్ భక్త్, టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు బీఎస్.మూర్తి, నరహరిశాస్త్రి, బెర్లిన్‌లోని భారత రాయబారి డాక్టర్ రామానుజ్ బెనర్జీ, జన్మన్ కాన్సులేట్ జనరల్ డాక్టర్ కాత్రిన్‌మిసెరా –లాంగ్ తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత జలాలతో పంటలకు నష్టం



ఎల్గొండగూడలో దెబ్బతిన్న వరి పంట

**షాబాద్:** భూగర్భ జలాల కలుషితంతో వరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధి ఎల్గొంగూడ గ్రామానికి చెందిన రైతు నర్సింహులుగౌడ్.. ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, బోరు నీటితో వరి పంటను సాగు చేశాడు. నారు వేసిన 15 రోజులకే పంట మొత్తం చనిపోయింది. దీనికి కారణం సమీపంలోని పరిశ్రమే అని, ఆ కంపెనీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమై పంటలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. చాలా మంది రైతుల పరిస్థితి ఇదేనని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సదరు పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని, ఫలితంగా కంపెనీ నుంచి వెలువడే పొగ, దుమ్ము, ధూళితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని వాపోయారు. కలుషిత నీరు తాగిన పక్షులు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు.



# పోలీసు కస్టడీకి నిందితుడు



నిందితుడు ప్రభాకర్

**మొయినాబాద్:** ఇంజినీరింగ్ కళాశాలల్లో చోరీకి పాల్పడి, గచ్చిబౌలిలో కాల్పుల ఘటనలో అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితున్ని స్థానిక పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించి కీలక ఆధారాలు సేకరించి జైలుకు పంపారు. వివరాల ఇలా ఉన్నాయి. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబర్ 7న రాత్రి నిందితుడు బత్తుల ప్రభాకర్ అలియాస్ బిట్టు అలియాస్ హరీష్ ఆఫీస్ రూం కిటికీలు పగలగొట్టి లోపలికి చొరబడ్డాడు. లాకర్‌లోని రూ.7.80 లక్షల నగదు అపహరించాడు. జనవరి 8న అర్ధరాత్రి అజీజ్‌నగర్ చౌరస్తాలోని వీజేఐటీ ఇంజినీరింగ్ కళాశాల కార్యాలయ గదిలో చొరబడ్డాడు. లాకర్‌ను పగలగొట్టి రూ.15.24 లక్షల నగదును దోచుకెళ్లాడు. ఈ కేసుల్లో పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇటీవల నగరంలోని గచ్చిబౌలిలో కాల్పులు జరిపిన కేసులో ప్రభాకర్‌ను అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితున్ని, మొయినాబాద్ పోలీసులు ఈ నెల 22న కోర్టు అనుమతితో రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డీఐ రమేష్‌నాయుడు ఘటనా స్థలాలకు తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించారు. సోమవారం నిందితున్ని కోర్టులో హాజరుపర్చి చర్లపల్లి జైలుకు తరలించారు.

# రిఫ్రిజిరేటర్ మీద పడి వ్యక్తి మృతి



యాదయ్య(ఫైల్)

**మొయినాబాద్:** నిద్రమత్తులో రిఫ్రిజిరేటర్ వెనకభాగాన్ని లాగడంతో ప్రమాదవశాత్తు మర్మాయవాలపై పడి ఓ వక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బసగల్ల యాదయ్య(46) ఈ నెల 19న రాత్రి 10 గంటలకు నిద్రమత్తులో లేచి నీళ్లు తాగడానికి రిఫ్రిజిరేటర్ వద్దకు వెళ్లాడు. ముందు వైపు నుంచి రిఫ్రిజిరేటర్ డోర్ తీయకుండా వెనకవైపు వెళ్లి రాడ్డు పట్టుకుని లాగాడు. దీంతో రిఫ్రిజిరేటర్ అతనిపై పడి, మర్మాయవాలకు తీవ్రగాయం అయింది. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చికిత్సకోసం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. 20న నగరంలోని గాంధీకి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ 23న రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం





మంజుల (ఫైల్),బాలుడు మల్లేశ్ (ఫైల్)

**కడ్తాల్:** ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధి వంపూగూడ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన చెవిటి మంజుల(32)తో కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధి వంపూగూడ గ్రామానికి చెందిన పోతుగండి శేఖర్‌కు 15 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి నలుగురు సంతానం. ఏడాది కాలంగా శేఖర్ మద్యానికి బానిసై, భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఇదే విషయమై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఆమె ఈ నెల 22న ఆమనగల్లులో చదువుకుంటున్న పిల్లల వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఆరేళ్ల కుమారుడు మల్లేశ్, ఏడేళ్ల కూతురు అనూను తీసుకుని వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో మంజుల తమ్ముడు అంజయ్య సోమవారం కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

**గచ్చిబౌలి:** ఇంటి మరమ్మతు పనులు చేస్తూ ప్రమాదవశాత్తు భవనం 12వ అంతస్తు నుంచి కింద పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన లక్ష్మణ్(37) నగరానికి వలస వచ్చి నార్సింగి ప్రాంతంలో నివాసం ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం అతను గచ్చిబౌలి, బాంబూస్ అపార్ట్‌మెంట్స్‌లోని 12 అంతస్తులో పునర్నిర్మాణ పనుల్లో పాల్గొన్నాడు. గాలి రాకపోవడంతో కిచెన్ విండోకు ఉన్న గ్లాసు డోర్ తెరిచి పనులు చేస్తున్న అతను ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కల్లుతాగేందుకు వచ్చి.. గొలుసు చోరీ చేసి

- బాధితురాలి అరుపులతో గ్రామస్తులకు చిక్కిన దొంగ
- పోలీసులకు అప్పగింత



గామస్తులకు చిక్కిన నిందితుడు

**శంకర్‌పల్లి:** కల్లు తాగి.. కల్లు విక్రయిస్తున్న మహిళ మెడలో నుంచి ఓ వ్యక్తి బంగారు గొలుసును తెంపుకొని పారిపోతుండగా.. గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కల్వేముల సులోచన, రాజు గౌడ్ దంపతులు గ్రామంలో కల్లు విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం సులోచన దుకాణంలో కల్లు విక్రయిస్తుండగా.. చేవెళ్ల మండలం తలారం గ్రామానికి చెందిన ఖానాపురం మురళీ(26) అక్కడికి వచ్చి కల్లు తాగాడు. ఎవరూ లేకపోవడాన్ని గమనించి, ఆమె మెడలో నుంచి 3.5 తులాల బంగారు గొలుసుని లాక్కొని పారిపోతుండగా.. బాధితురాలు కేకలు వేసింది. దీంతో అప్రమత్తమైన గ్రామస్తులు.. దొంగను పట్టుకొని చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి, అప్పగించారు. అయితే మురళీ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టేవాడని, దానికి బానిసై త్వరగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో కల్లు తాగి, దొంగతానికి పాల్పడినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో కారులో మంటలు



ఘటనా స్థలంలో కారు

**మొయినాబాద్:** షార్ట్ సర్క్యూట్‌తో కారులో మంటలు చెలరేగిన సంఘటన పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రాహుల్ రాత్రి 10 గంటల సమయంలో చేవెళ్ల వైపు నుంచి నగరానికి కారులో వెళ్తున్నాడు. మొయినాబాద్ ఠాణా ఎదుట ఉన్న బస్టాపు వద్దకు రాగానే అధిక వేడి వలన ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన రాహుల్, అందులో ఉన్నవారు కిందకు దిగి మంటలు ఆర్పారు. అప్పటికే ఇంజన్‌లో వైరింగ్ మొత్తం కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# భార్య తిట్టిందని పీఎస్‌లో భర్త ఫిర్యాదు

- భర్త చూస్తుండగా ఇంట్లో నుంచి మరో వ్యక్తి పరార్
- ప్రశ్నించినందుకు తిట్లపురాణం

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఇంట్లోకి పరాయి వ్యక్తి ఎందుకు వచ్చాడని ప్రశ్నించిన భర్తను.. భార్య బూతులు తిట్టగా.. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామానికి చెందిన మంచిరెడ్డి ఇంద్రాసేనారెడ్డికి 20 సంవత్సరాల క్రితం శంకర్‌పల్లి మండలం భయ్యంగూడెంకు చెందిన యువతితో వివాహం అయింది. ఏడేళ్లుగా రాగన్నగూడలో నివాసం ఉంటున్నారు. ఆమె పంచాయతీ కార్యదర్శిగా నిజామాబాద్ జిల్లా, భోదన్ మండలం, కల్దుర్కిలో పని చేస్తుంది. 15 రోజులకు ఒక సారి ఇంటికి వచ్చి పోతుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 22న రాగన్నగూడకు వచ్చింది. 23న ఉదయం 11 గంటల సమయంలో ఇంద్రాసేనారెడ్డి బయటకు వెళ్లాడు. కొద్ది సేపటికి ఫోన్లో సీసీ కెమెరాలు చెక్ చేసుకోగా అవి ఆఫ్‌లో ఉన్నట్లు గమనించాడు. అనుమానం వచ్చి ఇంటికి రాగా.. తలుపు పెట్టి ఉంది. భార్యకు ఫోన్ చేయగా.. ఆమె లిఫ్ట్ చేయలేదు. వెంటనే రామకృష్ణా రెడ్డి అనే వ్యక్తి డోర్ తీసుకొని ఇంట్లో నుంచి వస్తుండగా ఎందుకు వచ్చావని ఇంద్రాసేనారెడ్డి ప్రశ్నించగా.. అతడు తిడుతూ.. మొదటి అంతస్తు నుంచి దూకి కిందపడిపోయాడు. ఇదేమిటని భార్యను ప్రశ్నించగా.. అమె 'నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను. నీవు ఏం చేసుకుంటావో చేసుకో' అంటూ బూతులు తిట్టింది. ఇంట్లోకి చొరబడిన రామకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గతంలో శంషాబాద్‌లో ఉద్యోగం చేసే సమయంలో ఇద్దరికి పరిచయం అయినట్లు తెలిపాడు. ఇంట్లోకి వచ్చి నాపై దాడి చేసిన రామకృష్ణారెడ్డి, తిట్టిన భార్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇంద్రసేనారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. భవనంపై నుంచి దూకి గాయపడిన రామకృష్ణారెడ్డి ప్రస్తుతం తుర్కయంజాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.